# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 3-10-2023 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక: 50 పేజీలు:6 వెల: రూ.1/-


## గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి తెలంగాణ పల్లెలు ప్రతిరూపాలు : సీఎం కేసీఆర్



హైదరాబాద్, అక్టోబర్ 2:జాతి పిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నివాళులర్పించారు. దేశానికి గాంధీజీ చేసిన సేవలు, త్యాగాలను ముఖ్యమంత్రి కేసీఆర్ స్మరించుకున్నారు. దేశానికి గాంధీజీ అందించిన ఆశయాలు, సిద్ధాంతాలు, విజయాల స్ఫూర్తి.. తెలంగాణ రాష్ట్ర సాధాన, ప్రగతి ప్రస్థానంలో ఇమిడి ఉంది. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి తెలంగాణ పల్లెలు ప్రతిరూపాలుగా నిలిచాయని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు.

## వైద్యశాస్త్రంలో ఇద్దరికి నోబెల్..! కొవిడ్ వ్యాక్సిన్ అభివృద్ధికి దక్కిన ఫలితం..!

న్యూఢిల్లీ, అక్టోబర్ 2:వైద్యశాస్త్రంలో ఇద్దరికి నోబెల్ అవార్డు దక్కింది. వైద్యులు కాలిటన్ కరికో, డ్రూ వెయిస్‌మన్‌కు పురస్కారం వరించింది. కరోనా మహమ్మారికి కట్టడికి ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్ల అభివృద్ధి కోసం చేసిన కృషికి కాలిటన్ కరికో, డ్రూ వెయిస్‌మన్‌ను ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక చేసినట్లు నోబెల్ అసెంబ్లీ పేర్కొంది. 'కరోనా వైరస్‌కు వ్యతిరేకంగా సమర్థవంతంగా ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్ల అభివృద్ధి చేయడానికి సహాయపడే న్యూక్లియోసైడ్ బేస్‌కు సంబంధించిన ఆవిష్కరణలకు' నోబెల్‌తో గౌరవిస్తున్నట్లు జ్యూరీ పేర్కొంది.

కరోలిన్స్కా ఇన్‌స్టిట్యూట్‌లోని 50 మంది ప్రొఫెసర్‌లతో కూడిన నోబెల్ అసెంబ్లీ ఏటా ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందజేస్తున్నది. మానవజాతి ప్రయోజన కోసం వైద్యరంగంలో గణనీయమైన కృషి చేసిన శాస్త్రవేత్తలను జ్యూరీ గుర్తిస్తుంది. స్జోల్నోక్‌లో 1955లో జన్మించిన కటాలిన్ కరిక్ స్జెడ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా, పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయంలో పెరెల్‌మాన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లో అనుబంధ ప్రొఫెసర్‌గా ఉన్నారు.

డ్రూ వెయిన్‌మన్ పెన్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ కొనసాగుతున్నారు. ఇదిలా ఉండగా.. 1901 నుంచి ఇప్పటివరకు ఫిజియాలజీ, మెడిసిన్‌లో 113 నోబెల్ ప్రదానం చేయగా.. ఇందులో పన్నెండింటిని మహిళలు అందుకున్నారు. అత్యంత పిన్న వయస్కుడైన నోబెల్ గ్రహీతగా ఫ్రెడరిక్ జీ బాంటింగ్ నిలిచారు. 32 సంవత్సరాల వయస్సులో ఇన్సులిన్‌ను కనుగొన్నందుకు 1923 అవార్డును అందుకున్నారు. గతేడాది 2022లో మెడిసిన్‌లో నోబెల్‌ను స్వీడిష్ జన్యు శాస్త్రవేత్త స్వాంటే పాబోకు లభించింది.

## కేవలం ఎన్నికల్లో లబ్ది కోసమే ప్రధాని మోదీ ఆ ప్రకటన చేశారు : మంత్రి వేముల



నిజామాబాద్, అక్టోబర్ 2: ప్రధాని పసుపు బోర్డు ప్రకటన కేవలం ఎన్నికల్లో లబ్ది కోసమే చేశారు. పసుపు బోర్డు ఏర్పాటు చేయాలంటే పార్లమెంట్‌లో చట్ట సవరణ చేయాలి. మీకు నిజంగా రైతుల మీద ప్రేమ, చిత్తశుద్ధి ఉండి ఉంటే మొన్నటి ప్రత్యేక సమావేశాల్లో ఎందుకు పసుపు బోర్డు కోసం బిల్లు పెట్టలేదని కేంద్రాన్ని రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. బాల్కొండ నియోజకవర్గం ఏర్గట్ల మండలంలో సుమారు 21 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు రోజుల్లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని బాండ్ పేపర్ రాసిచ్చి రైతులను మోసం చేసిన బీజేపీ మళ్లీ పసుపు బోర్డు అని రైతులకు మోసపు మాటలు చెప్పడం దుర్మార్గమని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పసుపు బోర్డు పేరుతో రైతులను ఇంకా ఎన్ని సార్లు మోసం చేయాలని చూస్తారని మండిపడ్డారు. 1986 పార్లమెంట్ ద్వారా చట్టమైన స్పైస్ బోర్డులో భాగంగా ఉన్న పసుపుకు బోర్డు ఏర్పాటు చేయాలంటే ప్రత్యేక చట్టం చేయాలని ప్రధాని మోదీకి తెల్వదా అని నిలదీశారు.

ఎద్దు ఎవుసం తెల్వని కాంగ్రెస్ ను, రైతును మోసం చేసే బీజేపీ ని నమ్మితే అరిగోసలు తప్పవని..తస్మాత్ జాగ్రత్త అన్నారు. ఒకడేమో(బీజేపీ) మోటార్లకు మీటర్లు పెడతామని తిరుగుతున్నడు, ఒకడేమో(కాంగ్రెస్) గంటలో ఎకరం పరిస్తాం రైతులకు మూడు గంటల కరెంట్ చాలు అని మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు.

ఇప్పుడు మోసపు హామీలతో వస్తున్న వారి చేతిలో గతంలో అందరం అరిగోస పడ్డవాల్లమే అది గుర్తు చేసుకోవాలని అన్నారు.

సీఎం కేసీఆర్ సహకారంతో బాల్కొండ నియోజకవర్గం లోనీ ప్రతి పల్లెలో కోట్ల రూపాయల అభివృద్ధి చేశామని తెలిపారు. అన్ని రకాల సంక్షేమ పథకాలతో పల్లెలు అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నయని అన్నారు. మంత్రి వెంట రైతు నాయకుడు కోటపాటి నర్సింహ నాయుడు, డిసిసిబి వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### నేటి కందం - నేటికి అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

కం॥ తెలివిగ మన సేథిజీ
విలువలు పాటించి ఘనుల వేగమునూ ఓడన్
బిలియర్డ్స్ ఛాంపియనుగా
చెలగగ - భారతము - కౌముది బాందె వెసన్!!



-రాధశ్రీ

( 3-10-1992 బిలియర్డ్స్‌లో విశ్వ విజేతగా భారత్..)

సెల్:9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

# బీఆర్ఎస్ స్టీరింగ్ కేసీఆర్ చేతిలో.. బీజేపీది మాత్రం అదానీ చేతిలో..: మంత్రి కేటీఆర్




హైదరాబాద్, అక్టోబర్ 2: బీఆర్ఎస్ స్టీరింగ్ కేసీఆర్ చేతిలో ఉంది.. ఎంఐఎం స్టీరింగ్ అసదుద్దీన్ చేతిలో ఉంది.. బీజేపీ స్టీరింగ్ మాత్రం అదానీ చేతిలో ఉందని మంత్రి కేటీఆర్ విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో తలసరి ఆదాయం సహా పలు అంశాల్లో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్, హర్యానాను అధిగమించామని చెప్పారు. దేశానికి తెలంగాణ ధాన్యాగారంగా మారిందన్నారు. హైదరాబాద్ మలక్‌పేటలో ఐటెక్ న్యూక్లియస్ ఐటీ టవర్ నిర్మాణానికి మంత్రి కేటీఆర్ భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో స్వల్ప కాలంలోనే కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేశామన్నారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు.

హైదరాబాద్ అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. హైదరాబాద్‌లో అన్ని ప్రాంతాలకు మెట్రో విస్తరిస్తామని చెప్పారు. ఓల్డ్ సిటీకి మెట్రో తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. మూసీ ఆధునీకరణ పనులను త్వరలో పూర్తిచేస్తామని మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో గతంలో తరచూ కర్ఫ్యూ పరిస్థితులు ఉండేవన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో తొమ్మిదేండ్లుగా రాష్ట్రం ప్రశాంతంగా ఉందన్నారు.

చిన్నప్పుడు మలక్‌పేట్ అంటే టీవీ టవర్ అనేవాళ్లని, రాబోయే రోజుల్లో మలక్‌పేట అంటే ఐటీ టవర్ అంటారన్నారు. 44.20 ఎకరాల్లో ఐటీ టవర్‌ను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. అయితే మొదటి విడతగా 10.35 ఎకరాల్లో రూ.1,032 కోట్ల వ్యయంతో 21 అంతస్తులతో 20 లక్షల చదరపు అడుగుల్లో ఐటెక్ న్యూక్లియస్ ఐటీ టవర్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. 36 నెలల్లోనే ఐటీ టవర్ నిర్మాణాన్ని పూర్తిచేస్తామని వెల్లడించారు. మైక్రోసాఫ్ట్, అడోబ్ వంటి పెద్దకంపెనీలు ఇక్కడకు తీసుకొస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో ఐటీ రంగం దూసుకెళ్తున్నదని చెప్పారు. బెంగళూరు కంటే అధికంగా ఐటీ ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు.

# ఎన్ని ట్రిక్కులు చేసినా.. హ్యాట్రిక్ సీఎం కేసీఆరే : మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట, అక్టోబర్ 2: తెలంగాణలో ప్రతిపక్ష పార్టీలు ఎన్ని ట్రిక్కులు చేసినా.. హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కేసీఆరే అని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ లేచేది లేదు.. కాంగ్రెస్ గెలిచేది లేదు అని మంత్రి తేల్చిచెప్పారు. దుబ్బాక పట్టణంలో డబుల్ బెడ్రూమ్ ఇండ్ల వద్ద స్వర్గీయ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి విగ్రహాన్ని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి మంత్రి హరీశ్‌రావు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. రామలింగారెడ్డి విగ్రహాన్ని తన చేతుల మీదుగా ఆవిష్కరిస్తానని ఊహించలేదు. ఇలా జరుగుతుందని అనుకోలేదన్నారు. రామలింగారెడ్డి అంటే వైవిధ్యాల సమ్మేళనం అని పేర్కొన్నారు. గన్నుతో, పెన్నుతో పోరాటం చేసిన వ్యక్తి ఆయన.. అందరి కంటే భిన్నంగా ఉండేవారని మంత్రి గుర్తు చేశారు. రామలింగారెడ్డి ఆత్మ శాంతి చేకూరాలంటే దుబ్బాక గడ్డమీద గులాబీ జెండా ఎగరాలన్నారు. ఉద్యమ స్ఫూర్తితో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమంలో జోడెడ్లుగా రామలింగారెడ్డి తాను కలిసి పని చేశాం. మానుకోట, మనోహరాబాద్ రైల్వే రోకో, హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద ధర్నా, రాస్తారోకో, నిరసనలు, 48 గంటలు నిద్రాహారాలు మానుకుని చేసిన జ్ఞాపకాలను హరీశ్‌రావు గుర్తు చేసుకున్నారు. తన ఆరోగ్యం లెక్క చేయకుండా పని చేసి లింగన్న ప్రాణాలు కోల్పోయారు.

రామలింగారెడ్డి శంకుస్థాపన చేసిన పనులకే బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రిబ్బన్ కట్ చేస్తున్నారని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ గెలిచాక మూడేళ్లలో చేసిందేమీ లేదు. కానీ, చీరలు, సారెలు ఇస్తుండట. బీజేపీ రఘునందన్ రావు మాయ మాటలు నమ్మి సోలిపేట సుజాత అక్కకు అన్యాయం చేశారు. రఘునందన్ అరచేతిలో వైకుంఠం చూపితే దుబ్బాక ప్రజలుగా నమ్మి మోసపోయాం. ఈ ఎన్నికల్లో మాయ మాటలు నమ్మి మోసపోవద్దు. సోలిపేట కుటుంబానికి అండగా ఉంటా.. రాజకీయంగా నిలబెడతానని మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు.

## పేదల సొంతింటి కలను నిజం చేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిది : మంత్రి తలసాని



సంగారెడ్డి, అక్టోబర్ 2: (నేటినిజం ప్రతినిధి):పేదల సొంత ఇంటి కలను నిజం చేసిన ఘన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదని సంక్షేమ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం కొల్లూరులో 6,067 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనల నుంచి పురుడు పోసుకుందే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ కార్యక్రమం అన్నారు. అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి పేదలకు ఉచితంగా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ అని స్పష్టం చేశారు.

దేశంలో ఎక్కడైనా ఉచితంగా పేదలకు అన్ని సౌకర్యాలతో కూడిన ఇల్లు ఉచితంగా ఇస్తున్నారా ఉచితంగా ఇండ్లు నిర్మించి ఇస్తున్నట్లు నిరూపిస్తే వెంటనే నా పదవికి రాజీనామా చేస్తానని ప్రతి పక్షాలకు సవాల్ విసిరారు. ఇల్లు లేని పేద ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయడం కోసం లక్ష ఇండ్లు నిర్మించాం. అవస రమైతే మరో లక్ష ఇండ్లను నిర్మిస్తాం. ఎవరు కూడా ఆందోళ చెందాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పైసా ఖర్చులేకుండా పేదలకు ఉచితంగా డబుల్ బెడ్ రూం ఇండ్లు : మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్, అక్టోబర్ 2: దేశంలో ఎక్కడా లేని విధంగా డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి పేద వారి నుంచి రూపాయి కూడా చెల్లించ అవసరం లేకుండా ఉచితంగా అందజేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని, హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. రాజేంద్ర నగర్, నార్సింగిలో 3వ విడతలో ఎంపికైన లబ్దిదారులకు 356 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలను మేయర్విజయలక్ష్మి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదవారి సొంతింటి కలను ముఖ్యమంత్రి కేసీఆర్ నిజం చేశారన్నారు.

లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి విడల వారీగా ఫపేదవారికి ఉచితంగా అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఇదంతా సీఎం కేసీఆర్ కార్యధక్షత వల్లే సాధ్యమైందని చెప్పారు.

రాజకీయాలకు తావు లేకుండా పార్టీలకతీతంగా డ్రా నిర్వహించి లబ్ధిదారులకు అందజేస్తున్నామని గుర్తు చేశారు. ఈ నెల 5వ తేదీన నాలుగో విడత డబుల్ ఇండ్లనుపంపిణి చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, నార్సింగి మున్సిపల్ చైర్మన్ రేఖ, అడిషనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, ఆర్డీవో మల్లయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గూగుల్ మ్యాప్ ఆధారంగా వెళ్తు నదిలోకి వెళ్లిన కారు

### -కారు నీట మునిగి ఇద్దరు డాక్టర్లు మృతి

తిరువనంతపురం అక్టోబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); కేరళలోని కొచ్చిలో ఆదివారం రాత్రి ఘోరం జరిగింది. గూగుల్ మ్యాప్ ఆధారంగా వెళ్తున్న ఓ కారు పెరియార్ నదిలోకి వెళ్లింది. దీంతో కారు నీట మునిగింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు డాక్టర్లు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. మృతులను డాక్టర్ అద్వైత్(29), అజ్మల్(29) గా గుర్తించారు. వీరిద్దరూ ఓ ప్రయివేటు ఆస్పత్రిలో పని చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ముగ్గురిని స్థానికులు రక్షించినట్లు పేర్కొన్నారు. భారీ వర్షం కారణంగా కారులో ప్రయాణిస్తున్న వారికి రహదారి సరిగా కనిపించకపోవడం, గూగుల్ మ్యాప్ పక్కదోవ పట్టించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. లెఫ్ట్ టర్న్ తీసుకోవాలని గూగుల్ మ్యాప్ సూచించడంతో.. కారు అటుగా వెళ్లడంతో నదిలో మునిగినట్లు పోలీసులు తెలిపారు. దీంతో కారు నీట మునిగి ప్రమాదానికి గురైందని పోలీసులు పేర్కొన్నారు.

## కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై నిప్పులు చెరిగిన కేటీఆర్

సూర్యపేట,అక్టోబర్ 2: (నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ నిప్పులు చెరిగారు. సూర్యాపేటలో ఎవరికి డిపాజిట్ రాదో తేల్చుకుందాం రా.. అని కోమటిరెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. సూర్యాపేటలో ఐటీ హబ్‌ను ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

ఎన్ని ఎత్తులు, కుట్రలు చేసినా.. జగదీశ్ రెడ్డి విజయాన్ని ఆపలేరు.. ఆయన విజయం పక్కా ఖరారై పోయింది అని కేటీఆర్ స్పష్టం చేశారు. రాజకీయాల్లో యుద్ధం నేరుగా చేయాలి. చేసింది చెప్పాలి. 55 ఏండ్ల అధికారంలో ఉన్నామని కాంగ్రెస్, పదేండ్లు అధికారంలో ఉన్నామని బీజేపీ వాళ్లు చెబుతున్నారు. అన్ని ఏండ్లు అధికారంలో ఉండి ఏం చేశారో వారు చెప్పాలి. అదే విధంగా మేం కూడా చెప్పాలని కేటీఆర్ తెలిపారు.

సూర్యాపేటలో మెడికల్ కాలేజీ ప్రారంభమైంది.. పీజీ సీట్లు కూడా వచ్చాయని కేటీఆర్ గుర్తు చేశారు. సూర్యాపేటలో ఐటీ హబ్ ప్రారంభమైంది. కలలో ఎవరూ ఊహించని విధంగా సూర్యాపేట జిల్లా అయింది. నల్లగొండ పోవాల్సిన అవసరం లేకుండా పోయింది. కడుపు నిండా సంక్షేమం, కంటి ముందు అభివృద్ధి ఉంది. కాబట్టి జగదీశ్ రెడ్డిని ఆశీర్వదించి 50 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని మంత్రి కేటీఆర్ కోరారు.

దమ్ముంటే నేరుగా కొట్లాడాలి అని కేటీఆర్ అన్నారు. కొందరు శిఖండి రాజకీయాలు, పిచ్చి ప్రయత్నాలు చేస్తున్నారు. 2000లో కేసీఆర్‌కు ఒక తమ్ముడిలాగా, ఉద్యమానికి ఆకర్షితుడై జగదీశ్ రెడ్డి నడిచారు. పదవులపై ఆకాంక్షతో రాలేదు. కేసీఆర్ మాత్రమే తెలంగాణకు న్యాయం చేయగలడు. రాష్ట్రాన్ని సాధిస్తాడనే నమ్మకంతో ఒక సైనికుడిలాగా 24 ఏండ్ల కిందట కేసీఆర్‌తో కలిసి నడిచిండు. ఇవాళ కొందరు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. నిన్న ఒకాయన అంటాడు. సూర్యాపేటలో డిపాజిట్ రాదని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అంటున్నారు. దమ్ముంటే రా తేల్చుకుందాం. ఎవరికి డిపాజిట్ రాదో తేల్చుకుందాం అని కేటీఆర్ సవాల్ విసిరారు.

## కరీంనగర్ పౌరుల గౌరవం పెంచేలా.. అభివృద్ధి చేస్తున్నాం : మంత్రి గంగుల

కరీంనగర్, అక్టోబర్ 2:పార్టీలకు అతీతంగా కరీంనగర్ పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్‌లోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు మంత్రి సోమవారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..నగర పౌరుల గౌరవం పెరిగేలా అద్భుత నగరంగా తీర్చిదిద్దుతున్నామని, భవిష్యత్ తరాలకు గొప్ప నగరాన్ని అందించాలన్నదే తమ లక్ష్యం అని అన్నారు.

ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు అని, గెలిచిన తరవాత అందరూ నావల్లేనని, తనని నమ్మి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునే ప్రయత్నం చేస్తున్నానని చెప్పారు. నగరంలో 50 ఏళ్లలో జరగని అభివృద్ధి పనులు నేడు జరుగుతున్నాయని, గతంలో ఉన్న నాయకులు కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే రావడంతో నగర అభివృద్ధి కుంటుపడిందన్నారు.

ఎక్కడ చూసినా గుంతల రోడ్లతో నగరానికి వచ్చేందుకు వెనుకాడేవారని, నేడు కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన పనులతో నగరం అద్భుతంగా మారిందని పేర్కొన్నారు.

అభివృద్ధి ఇలాగే కొనసాగాలని కోరారు. ఎన్నికల వేళ..పచ్చని తెలంగాణలో విషం చిమ్మేందుకు కాంగ్రెస్..బీజేపీలు విషం చిమ్ముతున్నాయని మండిపడ్డారు. ఆయా పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని, మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ సునిల్ రావు, నగర డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# చెన్నై షాపింగ్ మాల్ ను ప్రారంభోత్సవం చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్

### -హాజీరైన ప్రముఖ సినీనటి కృతి శెట్టి, జబర్దస్త్ టీం




కరీంనగర్, అక్టోబర్ 2:(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ పట్టణ కేంద్రం లో చెన్నై షాపింగ్ మాల్ ను కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ యాదగిరి సునీల్ రావు తో కలిసి రాష్ట్ర బీసీ సంక్షేమ సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సోమవారం పారంబోత్సవం చేశారు. అలాగే సిల్వర్, జువెలరీ విభాగంను ప్రముఖ సినీనటి కుమారి కృతి శెట్టి పారంభోత్సవం చేశారు సినీనటి కుమారి కృతి శెట్టి మాట్లాడుతూ అతి పెద్ద చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభించడం ఆనందంగా ఉందని అన్నారు.

చెన్నై షాపింగ్ మాల్ తో పాటు అన్ని రకాలవస్త్రాలు, అలాగే సిల్వర్,జ్యువలరీ నగలు లభిస్తాయని, చెన్నై షాపింగ్ మాల్ ప్రజా ఆదరణ పొందాలని అన్నారు. సినీనటి కృతి శెట్టి, జబర్దస్త్ టీం శివ రెడ్డి, ముక్కు అవినాష్ చూడటానికి భారీ ఎత్తున ప్రజలు షాపింగ్ మాల్ కు తరలివచ్చారు. ఉత్తర తెలంగాణకు కేంద్ర స్థానంగా ఉన్న కరీంనగర్ లో షాపింగ్ మాల్ ప్రారంభించడం సంతోషంగా భావిస్తున్నామని షాపింగ్ మాల్ నిర్వాహకులు మర్రి జనార్ధన్రెడ్డి, వెంకటరెడ్డి, మర్రి శశిధర్రెడ్డి, మర్రి జమునారెడ్డి, మర్రి మధుమతి తెలిపారు నిష్ణాతులైన డిజైనర్లతో రూపొందించిన అధునాతన డిజైన్లతో కూడిన పట్టు వస్త్రాలను సొంత మగా నిష్ణాతులైన చేనేత కార్మికులతో, నిపుణుల పర్యవేక్షణలో నేయించడం వల్ల అతితక్కువ ధరలకు మాల్ ద్వారా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మంత్రి, మేయర్, నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చల్లా స్వరూప రాణి,43 డివిజన్ కార్పొరేటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గంటల తరబడి 'సోషల్' తెరల్లో మునకేస్తున్న చిట్టి మనసులు..!

కరోనా మహమ్మారి కాలంలో ప్రారంభమైన ఆన్‌లైన్ క్లాసుల పేరుతో పిల్లలకు, కౌమార యువత చేతుల్లో స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లు పెట్టిన తల్లితండ్రులు నేడు ఆ అలవాటుకు బానిసలైన పిల్లలను అదుపు చేయలేక దిక్కుతోచని స్థితిలో మదనపడుతున్నారు. పిల్లలు, కౌమార యువతకు పట్టిన ఇంటర్నెట్ పీడను విరగడ చేయడానికి ఏ మార్గం దొరకడం లేదని, వారించినప్పటికీ పిల్లలు మారాం చేస్తున్నారని, ఎంత బుజ్జగించినా వినడం లేదని, ఇలాంటి దుస్థితి రావడం బాధాకరమని వాపోతున్నారు. పట్టణ ప్రాంత బాలలు 61 శాతం స్మార్ట్‌ఫోన్ తెరలకు అతుక్కుపోతున్నారని, వీరిలో ప్రతి ముగ్గురిలో ఒక్కరు అనగా దాదాపు 33 శాతం చిన్నారులు డిజిటల్ తెరల దురలవాటుకు లోనయ్యారని, ఈ దుర్వాసనం కారణంగా ఆవేశ దూకుడు పెరగడం, నీరసపడడం, నిరాశల విష వలయంలో చిక్కుకొని తమ భవితను నాశనం చేసుకునే స్థాయికి చేరుతున్నారనే తీవ్ర హెచ్చరికలు చేస్తున్నారు. పట్టణప్రాంత 18 ఏండ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా (ఓటిటి, వీడియో, ఆన్‌లైన్ గేమ్, పోర్న్ ప్లాట్‌ఫామ్స్ లాంటివి) వాడడానికి పరిమితులు, అనుమతులు తీసుకునేలా ప్రభుత్వాలు 'డిజిటల్ ప్రైవేట్ డాటా ప్రొటెక్షన్ లా' లాంటి చట్టం తీసువచ్చేలా చర్యలు చేపట్టాలని 73 శాతం మంది తల్లితండ్రులు కోరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది.

రోజుకు గంటల పాటు తెరల ముందు:

అంతర్జాల తెరల్లో మునకలు వేస్తున్న 9 – 17 ఏండ్ల యువత లేదా పిల్లల్లో 15 శాతం వరకు రోజుకు 6 గంటలకు పైగా స్మార్ట్‌ఫోన్, ట్యాబ్, లాప్‌టాప్ లేదా ఇతర డివైజెస్ వాడుతున్నట్లు, 46 శాతం పిల్లలు రోజుకు 3 – 6 గంటలు, 39 శాతం బాలలు 1 – 3 గంటల పాటు డిజిటల్ తెరలకు అతుక్కుపోతున్నట్లు ఇటీవల 'లోకల్‌సర్కిల్స్' అనబడే సంస్థ అధ్యయనాల్లో తేలింది. ఆన్‌లైన్ సైట్లలో గంటల తరబడి గడుపుతున్న 39 శాతం బాలలు దూకుడుగా (అగ్రెసివ్‌గా), 37 శాతం మంది అసహనంగా, 22 శాతం నీరసంగా, 25 శాతం అతి చురుకుదనంగా(హైపర్‌ఆక్టివ్‌గా), 27 శాతం నిరాశగా ఉంటున్నట్లు అధ్యయనం తెల్పింది. ఇంటర్‌నెట్ వాడే పిల్లల్లో 8 శాతం సంతోషంగా, 10 శాతం కలివిడిగా ఉంటున్నారని తెలుస్తున్నది.

అందుబాటులో ఉన్న పలు రకాల సామాజిక మాధ్యమాలు:

సామాజిక మాధ్యమాల వాడకంలో 9 – 17 ఏండ్ల పిల్లలు/కౌమార యువతలో 35 శాతం మంది ఇన్‌స్టాగ్రామ్, వాట్స్‌అప్, స్నాప్‌షాట్ వేదికలను వాడుతున్నారని, 37 శాతం మంది వీడియో, యూట్యూబ్, ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్, హాట్‌స్టార్ లాంటి వేదికల్లో గంటల తరబడి కాలం గడుపుతున్నారని తేలగా, 33 శాతం ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నారని విశ్లేషించారు. 18 ఏండ్ల లోపు పిల్లలు/కౌమార యువత అంతర్జాల వేదికలను వాడడానికి తల్లితండ్రుల అనుమతి తీసుకోవాలని 73 శాతం మంది పేరెంట్స్ భావిస్తుండగా, 13 శాతం మంది పేరెంట్స్ మాత్రం 15 ఏండ్లు దాటిన కౌమార యువతకు ఎలాంటి ఆంక్షలు అవసరం లేదని అభిప్రాయపడ్డారు.

ఇంటర్నెట్ దురలవాటు దుష్ప్రభావాలు:

స్మార్ట్‌ఫోన్, ట్యాబ్, లాబ్‌టాప్ లాంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను రోజుకు పలు గంటలు వాడుతున్న 9 – 18 ఏండ్ల పిల్లలు/కౌమార యువతలో తీవ్రమైన అనారోగ్యాలు కలుగుతున్నట్లు నిర్ధారణ అయ్యింది. నెట్టింట్లో అనేక గంటలపాటు తెరలకు అత్తుకుపోతున్న పిల్లలు/కౌమార యువతలో ఓపిక లేకపోవడం, ఆవేశపడడం, ఉద్రేకపడడం, ఏకాగ్రతను కోల్పోవడం, తలనొప్పి, జ్ఞాపకశక్తి సమస్యలు, కంటి జబ్బులు, వెన్నునొప్పి, ఒత్తిడి, ఆందోళన, సంభాషణనా సమస్యలు, సోమరితనం, నిరాశ లాంటి అవలక్షణాల పాలు అవుతున్నారని అధ్యయన నివేదిక స్పష్టం చేసింది.

'లోకల్‌సర్కిల్స్ సంస్థ' నిర్వహించిన సర్వేలో దేశవ్యాప్తంగా 296 జిల్లాల్లో నుంచి 46,000 మంది పట్టణ ప్రజల అభిప్రాయాలను, అందులో 38 శాతం మహిళల మనోభావాలను రికార్డు చేశారు. అంతర్జాల విష వలలో చిక్కకుండా 8 శాతం మంది బాలలు/కౌమార యువత మాత్రమే ఆన్‌లైన్‌ను వినియోగించినప్పటికీ తమ నియంత్రణలో ఉంటూ సంతోషంగా ఉన్నారని తల్లితండ్రులు పేర్కొనడం మిగిలిన 92 శాతం మంది పరిస్థితిని ప్రమాదంలోకి నెట్టివేస్తున్నది. ఒకప్పుడు జూదం, తాగుడు, పొగాకు లాంటి దురలవాట్లకు అలవాటు పడిన జనులు ఉండేవారు. నేడు యువత ముంగిట డ్రగ్స్, ఇంటర్నెట్, పబ్స్, రేవ్ పార్టీలు లాంటి ఆధునిక హంగులు వండి వార్చే కల్చర్ పెరగడంతో డిజిటల్ యుగపు బాలలు, కౌమార యువత, యువతీయువతకులు నవ్య దురలవాట్లకు బానిసలై రేపటి భవితను బుగ్గిపాలు చేసుకోవడం అత్యంత బాధాకరం. ఈ పరిస్థితులను గమనిస్తూ తల్లితండ్రులు, సమస్త సమాజం, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో నేటి బాలలను టెక్నాలజీ దుర్వినియోగ ఊబిలో పడకుండా సంరక్షించుకునే బాధ్యతను భుజాన వేసుకోవాలి. ఈ విషయంలో అశ్రద్ధ వహిస్తే నేటి దురలవాట్ల యువతే రేపటి అనారోగ్య భారతం అవుతుందని తెలుసుకోవాలి.



– డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# సుప్రసిద్ధ రంగస్థల నటుడు పుట్రేవు శ్రీహరిరావు అస్తమయం

## రంగస్థల నటనకు కొత్తరూపం తెచ్చిన యోధుడు శ్రీహరిరావు

## శోకసముద్రంలో రంగస్థల కళాకారులు



హైదరాబాద్, అక్టోబర్ 2:రంగస్థల కళామతల్లి ఒక యోధుణ్ణి కోల్పోయింది. రంగస్థల కళకు రూపం తెచ్చిన మహనీయుడు పుట్రేవు శ్రీహరిరావు(91) సెప్టెంబర్ 29 తెల్లవారుజామున అస్తమించారు. ఎన్నో ప్రదర్శనలు, ఎన్నో సత్కారాలు వరించినాకూడా శ్రీహరిరావు ఏనాడూ గర్వంతో ఉన్న క్షణాలే లేవంటే ఆయనకు కళపై ఉన్న మక్కువ ఎలాంటిదో అర్ధమవుతుంది. రంగస్థలానికి ఎనలేని సేవలందించిన శ్రీహరిరావుకి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఆయన నటించిన అనేక నాటక ప్రదర్శనలలో కర్ణుడు, అర్జునుడు పాత్రలు ఎంతో కీర్తిని గడించాయి. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న శ్రీహరి రావు హైదరాబాద్ అలకాపురిలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. చిన్ననాటినుండి నాటకరంగంపై మక్కువను పెంచుకున్న శ్రీహరిరావు ఉన్నత విద్యావంతులు. తెలంగాణ ప్రాంతం మహబూబ్‌నగర్ మండల తహశీల్దారుగా విధులు నిర్వహిస్తూనే విద్యానాట్యమండలిని స్థాపించి అనేక నాటక ప్రదర్శనలతోపాటు సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహించి తనదైన ముద్ర వేశారు. సోదరులు, రంగస్థల నటులైన పుట్రేవు రాధాకృష్ణమూర్తితో కలిసి పద్యనాటకాలలో పద్యం పాడటంలో నూతన ఒరవడిని సృష్టించారు. ఉద్యోగ విరమణ పొందిన తరువాత తన నివాసాన్ని హైదరాబాద్ అలకాపురి కాలనీకి మార్చుకొని కొన్ని సంవత్సరాలపాటు అలకాపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు అధ్యక్షునిగా కొనసాగారు. కాలనీ వాసుల సమస్యలను పరిష్కరించటంలో ఆయన ఎంతో మక్కువ చూపేవారు. కాలనీ వాసులకు మౌలిక సదుపాయాలైన త్రాగునీరు, డ్రైనేజి సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళి వాటిని పరిష్కరించగలిగారు. ఇట్లా చెప్పుకొంటూ పోతే ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అప్పటి అసోసియేషన్ కోశాధికారి పొత్తూరి సుబ్బారావుకి కవిత్వంపై ఉన్న మక్కువను గ్రహించి అసోసియేషన్ ద్వారా ఎన్నో కవిసమ్మేళనాలు నిర్వహింప చేసేవారు. ప్రతి ఏటా శ్రీరామనవమి పర్వదినాన అలకాపురి పార్కులో సీతారామకల్యాణం నిర్వపించి, కాలనీవాసులందరికీ అన్నప్రసాద వితరణ కావించేవారు. అట్లాగే వినాయకచవితిని పురస్కరించుకొని ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేవారు. తన అభిమానులకు, రంగస్థల కళాకారులకు ఎప్పుడూ సత్యంవైపు నిలబడాలని హితబోధ చేసేవారు. ఆయన మరణవార్త విన్న కాలనీవాసులు, కళాకారులు పెద్ద ఎత్తున ఆయన భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, రంగస్థల నటుడు సంజీవరావు, మరో రంగస్థల నటుడు మల్లాది వెంకటరమణ, డి.ఎ.శర్మ, ధనకోటేశ్వరరావు, పి.వి.జి.కె.మూర్తి, శ్రీమాన్ వీరేందర్ ప్రముఖులు వున్నారు.

# స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం ద్వారా సముద్ర జలాలవల్ల ఏర్పడిన ఉప్పునీటి కయ్యల (బ్యాక్ వాటర్స్) నుంచి సేకరిస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 2:కర్నాటక రాష్ట్రంలో 'స్వచ్ఛత హీ సేవా' ప్రచార కార్యక్రమం కింద సాలిగ్రామ కయాకింగ్ పాయింట్‌తో పాటు, ఉడిపి జిల్లా పంచాయతీ , కోటతట్టు మరి టయు కోడి గ్రామ పంచాయతీల సహకారంతో సాలిగ్రామ కోడి బ్యాక్ వాటర్ పాయింట్ వద్ద ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలలో ఉప్పునీటి కయ్యలు ఉన్నచోట చెత్త పేరుకుపోవడంతో ఈ ప్రత్యేక స్థలాన్ని శుభ్రపరిచేందుకు జిల్లా పంచాయతీతో పాటు జిల్లా యంత్రాంగం ఎంపిక చేసింది. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో పాటు మరియు సామాజిక వర్గాలు పాల్గొనడం విశేషం. ఇది పరిశుభ్రత మరియు పర్యావరణ అవగాహనను పెంపొం దించడానికి తోడ్పడే గణనీయమైన యత్నంగా భావిస్తున్నారు. ఈ కార్యక్రమం జాతీయ జెం డాను ఎగురవేసిన తరువాత పరిశుభ్రత మరియు పర్యావరణ పరిరక్షణ పట్ల నిబద్ధతను నొక్కిచెప్పే స్వచ్ఛత ప్రమాణ స్వీకారంతో ప్రారంభమై ంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఉప్పునీటి కయ్యల నుంచి నుంచి 500 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను, ఇతర చెత్తను సేకరించారు. ఈ విధంగా సేకరించిన వ్యర్థాలను ఘన వ్యర్థాల నిర్వహణ (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఎస్‌డబ్ల్యూఎం) కేంద్రానికి సరైన రీతిలో, శాస్త్రీయపద్ధతిలో పారవేయడం కోసం పంపారు.

# జమ్ము కాశ్మీర్‌లో వ్యర్థాలపై యుద్ధం కార్యక్రమానికి రాయబారిగా పరమ వీర్ చక్ర అవార్డు గ్రహీత కెప్టెన్ బాణా సింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 2:కేంద్రపాలిత ప్రాంతమైన జమ్ము కాశ్మీర్ గ్రామీణ ప్రాంతాలో పారిశుధ్య సవాలును ఎదుర్కొనేందుకు , దేశ అత్యున్నత శౌర్య అవార్డు పరమ వీర చక్రను గెలుపొందిన కెప్టెన్ బాణా సింగ్ను , జమ్ము కాశ్మీర్ , డైరక్టరేట్ ఆఫ్ రూరల్ శానిటేషన్ , వ్యర్థాలపై యుద్ధం కార్యక్రమానికి రాయబారిగా నియమించింది.

ఈ విషయాన్ని జమ్ము కాశ్మీర్ రూరల్ శానిటేషన్ కార్యక్రమ డైరక్టర్ శ్రీ చంద్రదీప్ సింగ్, జజమ్ములోని ఆర్.ఎస్.పుర లో గల కెప్టెన్ బాణా సింగ్ స్టేడియంలో జరుగుతున్న స్వచ్ఛతా హి సేవ (ఎస్.హెచ్.ఎస్ 2023) సందర్భంగా ప్రకటించారు.

స్వచ్ఛతా హి సేవ (ఎస్.హెచ్ ఎస్ 2023)ను సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 02 వరకు నిర్వహిస్తున్నారు. పారిశుధ్యాన్ని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకువెళ్లాలన్న లక్ష్యంతో అక్టోబర్ 2 న దేశ వ్యాప్తంగా జరిగే స్వచ్ఛ భారత్ దివస్ కు ముందస్తుగా దీనిని చేపట్టారు. దీనిని ఒక ప్రజా ఉద్యమంగా చేపడుతున్నారు.

ఎన్.హెచ్.సి ?2023 ముఖ్యాంశం 'వ్యర్థాల రహిత భారతదేశం'. సఫాయి మిత్రల సంక్షేమం, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై ఈ సందర్భంగా దృష్టి కేంద్రీకరిస్తారు.

బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కంటోన్మెంట్ బోర్డులు, సముద్ర తీరాలు, పర్యాటక ప్రాంతాలు, జంతు ప్రదర్శన శాలలు,

జాతీయ పార్కులు, అభయారణ్యాలు, చారిత్రక కట్టడాలు, వారసత్వ ప్రదేశాలు, నదీతీరాలు,ఘాట్లు, డ్రైయిన్ లు ,నాలల వద్ద స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహిస్తారు.

జమ్ము కాశ్మీర్ , గ్రామీణ పారిశుధ్య సంస్థ డైరెక్టర్ శ్రీ చంద్రదీప్ సింగ్ మాట్లాడుతూ, వ్యర్థాలపై యుద్ధం కార్యక్రమం, వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన ప్రధాన సమస్యపై దృష్టి కేంద్రీకరిస్తుందని అన్నారు.

అలాగే జమ్ముకాశ్మీర్ లోని గ్రామీణ ప్రాంతాలలో పర్యావరణ పరిరక్షణపై పై దృష్టిపెడుతుందన్నారు. పరమ వీర్ చక్ర అవార్డు గ్రహీత కెప్టెన్ బాణా సింగ్ ఈ అవగాహనా కార్యక్రమంలో చేతులు కలపడం వల్ల

సుస్థిర పర్యావరణ హిత కార్యక్రమాలను ముందుకు తీసుకు వెళ్లడానికి, ఈ దిశగా స్థానికులకు ప్రేరణ నివ్వడానికి , స్థానిక ప్రజలు ఉత్సాహంగా పరిసరాల పరిశుభ్రతా కార్యక్రమాలలో పాలుపంచుకోవడానికి వీలు కలుగుతుందన్నారు.

ఇది వ్యర్థాలను తగ్గించడానికి, జమ్ముకాశ్మీర్ ప్రకృతి సౌందర్యాన్ని కాపాడడానికి ఉపయోగపడుతుందన్నారు.

కెప్టెన్ సింగ్, అంకిత భావంగల, అసమాన ధైర్య సాహసాలు గల మిలటరీ సర్వీస్ అధికారిగా మంచి పేరు తెచ్చుకున్నారు.

ప్రస్తుతం ఆయన జమ్ము కాశ్మీర్ స్వచ్ఛతను, అందాన్ని కాపాడే బృహత్తర బాధ్యతను స్వీకరించారు. ఈ దిశగా వ్యర్థాలు, కాలుష్యంపై పోరాటానికి నాయకత్వం వహిస్తారు. వ్యర్థాలపై యుద్ధం కార్యక్రమానికి రాయబారిగా , కెప్టెన్ బాణా సింగ్ తన అనుభవాన్ని, తన అంకిత భావాన్ని ఈ బృహత్తర కార్యక్రమం కోసం వినియోగించనున్నారు.

దేశ సరిహద్దులలో దేశ రక్షణకు అంకితభావంతో పనిచేసిన కెప్టెన్ బాణాసింగ్ ఇప్పుడు పర్యావరణ పరిరక్షణకు తన కృషిని కొనసాగించనున్నారు.

ఎన్.హెచ్.ఎస్ 2023 కార్యక్రమానికి సంబంధించి పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ, కెప్టెన్ బాణాసింగ్,

తనకు అప్పగించిన నూతన బాధ్యతలపై సంతోషం వ్యక్తం చేశారు. "దేశ రక్షణకు అంకితమైన విధంగానే నేను, పర్యావరణ పరిరక్షణకు అంకితమవుతున్నాను"అని ఆయన ప్రకటించారు. జమ్ము కాశ్మీర్ సహజసిద్ధ సౌందర్యం, జాతి విలువైన సంపద అని, దీనిని రాగల తరాల వారికి అంతే పరిశుభ్రతతో అందించడం అవసరమని ఆయన అన్నారు.

స్వచ్ఛతా ప్రతిజ్ఞా కార్యక్రమంలో సుమారు 2000 మందికి పైగా విద్యార్థులు, క్రీడాకారులు, ఎన్.సి.సి కేడెట్లు, పి.ఆర్.ఐ లు

చుట్టుపక్కల ప్రాంతాలలోని ప్రజలు, షాపుల యజమానులు,పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైకిల్ రేస్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు.

సైకిల్ రేస్, పెయింటింగ్ పోటీలలో గెలుపొందిన వారికి డైరక్టర్ బహుమతులు అందజేశారు.

## గత ఆరేళ్ళతో పోలిస్తే ఎన్‌సిఆర్‌లో వాయు నాణ్యత మొత్తపు మెరుగుదల సరళిని కొనసాగిస్తూ ఢిల్లీలో రోజువారీ సగటు వాయు నాణ్యత ఉత్తమ సూచీని నమోదు

న్యూఢిల్లీ, అక్టోబర్ 2:గత ఆరేళ్ళతో అంటే 2016 నుంచి 2023 (కోవిడ్ ప్రభావిత 2020ను మినహాయించి)తో పోలిస్తే జనవరి–సెప్టెంబర్ 2023 కాలంలో ఎన్‌సిఆర్‌లో వాయు నాణ్యత మొత్తపు మెరుగుదల సరళిని కొనసాగిస్తూ ఢిల్లీలో రోజువారీ సగటు వాయు నాణ్యత ఉత్తమ సూచీని నమోదు చేసింది. ప్రస్తుత సంవత్సరం పైన పేర్కొన్న కాలంలో ఢిల్లీకి రోజువారీ సగటు ఎక్యూఐ 167గా నమోదు అయింది. ఇది, 2022లో నమోదైన 184కన్నా, 2021లో 180 కన్నా, 2019లోని 188, 2018లో 193 ఇదే కాలంలో నమోదైన సూచీలకన్నా చాలా తక్కువ.

ఈ ఏడాది సెప్టెంబర్ మాసం 10 సెప్టెంబర్ 2023న మంచి వాయు నాణ్యత కలిగిన రోజుగా నమోదు కావడానికి సాక్షి అయింది, యాదృచ్ఛికంగా అది న్యూఢిల్లీలోని జి20 సదస్సు ముగింపు రోజు కావడం జరిగింది.

ఎక్యూఐ అన్నది వర్షపాతం/ అవక్షేపణం, వాయు వేగంతో ఎక్కువగా ప్రభావితం అవుతుంది. సెప్టెంబర్ 2023 మొత్తం 82.7 మిమిలతో తక్కువ వర్షపాతాన్ని నమోద చేసింది. ఇది సెప్టెంబర్ 2022లో నమోదైన 165 మిమిల వర్షపాతానికన్నా తక్కువ. తక్కువ వర్షపాతం ఉన్నప్పటికీ, సెప్టెంబర్ 2023లో రోజువారీ సగటు ఎక్యూఐ 108గా ఉంది. సెప్టెంబర్ 2022లో రోజువారీ సగటు ఎక్యూఐ 104గా నమోదైంది.

జనవరి – సెప్టెంబర్ 2023 కాలంలో ఢిల్లీలో మంచి నుంచి ఒక మాదిరి వాయు నాణ్యత (రోజువారీ సగటు ఎక్యూఐ ;200) కలిగిన అత్యధిక రోజులను (193)ఢిల్లీ వీక్షించింది. గత ఐదేళ్ళలో ఇదే కాలం (కోవిడ్ ప్రభావిత 2020)తో పోలిస్తే ఇది చాలా సానుకూల పరిణామం.

గత సంవత్సరాలలో ఇదే కాలంలో నమోదైన మంచి నుంచి ఒకమాదిరి వాయు నాణ్యత కలిగిన రోజులు ఈ విధంగా ఉన్నాయి – 2022లో 146, 2021లో 174, 2019లో 165, 2018లో 152. గత 6 ఏళ్ళలో రోజువారీ సగటు పిఎం 2.5, పిఎం 10సాంద్రీకరణలతో పోలిస్తే 2023కాలం చెప్పుకోదగిన తగ్గింపుకు సాక్షిగా ఉంది. జనవరి – ఆగస్టు 2023 కాలం 73 'ఐఎ/ఎ3 రోజువారీ సగటు పిఎం 2.5 సాంద్రీకరణలను నమోదు చేయగా, 2017 నుంచి 2022 (2020 కోవిడ్ ప్రభావిత కాలాన్ని మినహాయించి) ఇదే కాలంలో 82–95 'ఐఎ/ఎ3 లు నమోదు అయ్యాయి. అలాగే, రోజువారీ సగటు పిఎం 10 సాంద్రీకరణ ఢిల్లీలో 169 'ఐఎ/ఎ3గా ఉంది. ఇది 2017 నుంచి 2022 (2020 కోవిడ్ ప్రభావిత కాలాన్ని మినహాయించి) ఇదే కాలంలో నమోదు అయిన 183–215 'ఐఎ/ఎ3 కన్నా తక్కువ.

అనుకూలమైన వాతావరణ పరిస్థితులు, క్షేత్రస్థాయిలో కృషి, వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు వివిధ వాటాదారు ఏజెన్సీల చర్యలు, కొనసాగుతున్న పర్యవేక్షణ, అమలు చర్యలు 2023లో మెరుగైన వాయు నాణ్యతకు తోడ్పడ్డాయి.

# భారతదేశం విద్యా వ్యవస్థ సాంప్రదాయ జ్ఞానం తాజా ప్రపంచస్థాయి సాంకేతికత ఏకైక కలయికను అందిస్తుంది

న్యూఢిల్లీ, అక్టోబర్ 2:కేంద్ర రాష్ట్ర మంత్రి (స్వతంత్ర బాధ్యత) సైన్స్ ఊ టెక్నాలజీ; పీఎంఓ, పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్స్, అటామిక్ ఎనర్జీ స్పేస్ శాఖల మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు మాట్లాడుతూ, భారతదేశ విద్యా విధానం సాంప్రదాయ విజ్ఞానం తాజా ప్రపంచ స్థాయి సాంకేతికత ప్రత్యేకమైన కలయికను అందిస్తుంది, తద్వారా ప్రపంచానికి నాయకత్వం వహించడానికి భారతదేశానికి ప్రత్యేక ప్రయోజనాన్ని ఇస్తుందని అన్నారు. చంద్రయాన్–3, ఆదిత్య–ఎల్1, ప్రపంచంలోనే తొలిసారిగా భారతదేశంలో తయారు చేయబడిన డీఎన్ఏ వ్యాక్సిన్ మొదలైనవి భారతీయ వస్త్రధారణ ఈ ప్రత్యేక ప్రయోజనాన్ని సమర్థిస్తున్నాయని ఆయన అన్నారు. కమ్మూకశ్మీర్ కతువా జిల్లా బిల్లవార్ సమీపంలోని దాద్వారా (ఫింటర్)లోని భారతీయ విద్యా మందిర్ సీనియర్ సెకండరీ స్కూల్‌లో జరిగిన విద్యా కార్యక్రమంలో డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రసంగించారు. ఒక దశాబ్దం క్రితం ఊహించనటువంటి ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారతదేశం ఇప్పుడు ప్రపంచంలోని అత్యుత్తమ అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల కంటే ముందుంది. దాదాపు అన్ని రంగాలలో భారతదేశం తమను ముందుండి నడిపించాలని ప్రపంచం ఇప్పుడు కోరుకుంటోంది, జీ20 విజయం, 2023ని అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించే ప్రతిపాదనను అంగీకరించడం, అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రపంచ దృగ్విషయంగా మారడం మొదలైనవి ప్రస్తుత ప్రభుత్వంలో భారతదేశం పరాక్రమాన్ని తెలియజేస్తున్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ జోడించారు. అంతర్జాతీయ సహకారం భాగస్వామ్యం ద్వారా పరిశోధన ఆవిష్కరణల ద్వారా, భారతదేశం నికర జీరో ఉద్గారాల లక్ష్యాన్ని సాధించడానికి కూడా కట్టుబడి ఉంది, ఇది ప్రపంచ ఆందోళనలను పరిష్కరించడంలో ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో ప్రపంచ వాతావరణ ఉద్యమానికి నాయకత్వం వహించడంలో భారతదేశం కూడా ముందుంటుందని చూపిస్తుందని వివరించారు. విద్యార్థులను ఉద్దేశించి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, జాతీయ విద్యా విధానం–2020 ఈ దేశంలోని యువతకు కొత్త దృశ్యాలను తెరిచింది, ఇది ఇకపై ఆకాంక్షల ఖైదీ కాదు, కానీ అనేక అవకాశాలను తట్టిలేపడంతోపాటు సమృద్ధిగా టన్నుల కొద్దీ ఆకాంక్షలను కలిగి ఉందన్నారు. భారతదేశం అంతటా భారతీయ విద్యా మందిర్ పాఠశాలల సహకారాన్ని అభినందిస్తూ, డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, ఈ పాఠశాలలు తమ విద్యార్థులలో సాంస్కృతిక నైతికతను పెంపొందించడమే కాకుండా, భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో భాగమయ్యేలా వారిని తయారు చేశాయని అన్నారు. జీ20, చంద్రయాన్ మిషన్ మొదలైన వాటిలో భాగమని పేర్కొన్నారు.

# కుల సంఘాల అభివృద్దే సీఎం కేసీఆర్ ధేయం - జడ్పీటీసీ మ్యాకల రవి



రాజన్న సిరిసిల్ల,అక్టోబర్ 2:(నేటి నిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం చీర్లవంచ గ్రామంలో బేడ బూడగజంగాల సంఘం భవన నిర్మాణానికి సోమవారం జడ్పీటీసీ మ్యాకల రవి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మ్యాకల రవి మాట్లాడుతూ ఎమ్మెల్యే నిధుల నుండి బేడ బుడగజంగాల సంఘ భవన నిర్మాణానికి ఐదు లక్షలు రూపాయలు మంజూరు కాగా, నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. భవన నిర్మాణానికి సహకరించిన వేములవాడ శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కుల సంఘాల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, కెసిఆర్ నేతృత్వంలో పల్లెలు, పట్టణాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ను మూడవసారి సీఎంగా గెలిపించుకోవాలని, వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహా రావును రానున్న ఎన్నికల్లో గెలిపించి, మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చూట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బూర వజ్రమ్మ, వైస్ ఎంపీపీ ఆర్సి రావు, సర్పంచ్ రంగు సత్తెమ్మ, రాములు, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్ రావు, ఎంపీటీసీ వనపర్తి దేవరాజు, ఉపసర్పంచ్ శ్రీనివాస్ తో పాటు కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# గిరిజన వర్సిటీ,పసుపు బోర్డు మంజూరి పై హర్షం..మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం..



మహబూబాబాద్, అక్టోబర్ 2:(నేటినిజం ప్రతినిధి):ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం రోజున పాలమూరు వేదికగా జరిగిన బహిరంగసభలో తెలంగాణ ప్రజల ఆకాంక్షను సఫలం చేస్తూ ములుగు జిల్లాలో గిరిజన యూనివర్సిటీ మరియు నిజామాబాద్ కేంద్రంగా అంతర్జాతీయ పసుపు బోర్డు మంజూరీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం తొర్రూరు స్థానిక గెస్ట్ హౌస్ సెంటర్ వద్ద బీజేపీ గిరిజన మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపురం రాజకుమార్ ఆధ్వర్యంలో మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెదగాని సోమయ్య మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ ప్రజల మనోభావాలను, ఆకాంక్షలను పరిగణలోకి తీసుకుని గిరిజన యూనివర్సిటీ, మరియు పసుపు బోర్డు మంజూరీ చేయడం జరిగింది అని తెలిపారు. తెలంగాణ ప్రజల ఇలవేల్పు , ఆరాధ్య దైవం అయిన సమ్మక్క–సారక్కల పుణ్యస్థలం లో మోడీ గిరిజనుల అభివృద్ధి, అభ్యున్నతికై 900కోట్లతో గిరిజన యూనివర్సిటీ మంజూరీ చేయడం జరిగింది అని,దీనితో గిరిజన బిడ్డలు ఉన్నత చదువులు చదువుకోవడానికి అనువుగా ఉంటుంది అని తెలిపారు. తెలంగాణ గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మోడీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దేశంలోనే పసుపు ఎక్కువగా పండించే రైతులు అధికంగా ఉన్న నిజామాబాద్, ఆదిలాబాద్,మెదక్ లతో పాటు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న పసుపు రైతుల చిరకాల స్వప్నాన్ని మోడీ అంతర్జాతీయ పసుపు బోర్డు మంజూరీ చేసి సాకారం చేశారని తెలిపారు. అంతర్జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణ రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రదాని నరేంద్ర మోడీ తెలంగాణ సంక్షేమం కోసం ఎలాంటి వివక్ష లేకుండా క్రృషి చేస్తూ అధిక నిధులు మంజూరు చేస్తూ అభీవృద్దికి తోడ్పాటును అందిస్తూ ఆదుకుంటుంటే రాష్ట్రంలో కేసిఆర్ కుటుంబం మాత్రం మోడీ పై విషం చిమ్ముతూ విద్వేషాన్ని ఎగదోస్తూ రాజకీయ పబ్బం గడుపు తున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్, జిల్లా నాయకులు 15 వ వార్డు కౌన్సిలర్ కొలుపుల శంకర్,అలిసేరి రవిబాబు,పైండ్ల రాజేష్, జలగం రవి, గట్ల భరత్,పప్పుశెట్టి సంతోష్, కుమ్మరి కుంట్ల శివ, కొండ యాకన్న, గుండా సురేష్, శ్రీరాం, వరుణ్,మధు, హరీష్, గణేష్, సురేష్,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# 14 నిమిషాల్లో వందే భారత్ క్లీనింగ్..



తిరుపతి, అక్టోబర్ 2:స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా రైల్వే శాఖ ఈరోజు తిరుపతి రైల్వే స్టేషన్ లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో " 14 నిమిషాల అద్భుతం " కార్యక్రమాన్ని నిర్వహించింది. 16 కోచ్ ల వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును కేవలం 14 నిమిషాల్లో శుభ్రం చేయడం ఈ 14 నిమిషాల అద్భుతం యొక్క ముఖ్య ఉద్దేశం.

ఈ కార్యక్రమానికి గుంతకల్ ఎ డి ఆర్ ఎం, సి ఆర్ ఎస్ సి డబ్ల్యూ ఎం, తిరుపతి సి డి ఓ, స్టేషన్ డైరెక్టర్ నాయకత్వం వహించారు. అతి తక్కువ సమయంలో 14 నిమిషాల్లో ఇంత అద్భుతమైన పరిశుభ్రత సాధించడంపై ప్రయాణీకులు అభినందనలు తెలిపారు. రైల్వే అధికారులు నిర్వహించిన స్వచ్ భారత్ కార్యక్రమాల్లో 14 నిమిషాల్లో అద్భుతం కార్యక్రమం హైలైట్ గా నిలిచింది.

# దసరాకు 5265 ప్రత్యేక బస్సులు..

## 13 నుంచి 25 వరకు స్పెషల్ బస్సులు

హైదరాబాద్, అక్టోబర్ 2:బతుకమ్మ, దసరా పండుగలకు ప్రయాణికులను సురక్షితంగా చేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) ఏర్పాట్లు చేస్తోంది. సొంతూళ్లకు వెళ్లే వారి సౌకర్యార్థం 5,265 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని ప్లాన్ చేసింది. ఈనెల 13 నుంచి 25వ తేది వరకు ఈ ప్రత్యేక బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. ఈ ప్రత్యేక బస్సుల్లో 536 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని సంస్థ కల్పించింది. అక్టోబర్ 22న సద్దుల బతుకమ్మ, 23న మహార్ణవమి, 24 దసరాకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముండటంతో.. ఆయా రోజుల్లో అవసరాన్ని బట్టి మరిన్ని ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడపనుంది.

హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రం నలుమూలలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు ప్రత్యేక బస్సులు టీఎస్ఆర్టీసీ నడవనుంది. హైదరాబాద్‌లో ప్రధాన బస్టాండ్‌లైన ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్‌తో పాటు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే కేపీహెచ్ బీ కాలనీ, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఉప్పల్ బస్టాండ్, దిల్ సుఖ్ నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్, తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడపనుంది.

పండుగ రోజుల్లో ఎంజీబీఎస్–ఉప్పల్, ఎంజీబీఎస్–జేబీఎస్, ఎంజీబీఎస్–ఎల్బీనగర్ మార్గాల్లో ప్రతి 10 నిమిషాలకో సిటీ బస్సును అందుబాటులో ఉంచనుంది. అక్టోబర్ 21 నుంచి 23 వరకు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రెగ్యూలర్, స్పెషల్ సర్వీసులను ఎంబీజీఎస్ నుంచి కాకుండా వివిధ ప్రాంతాల నుంచి నడపాలని సంస్థ నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, మాచర్ల వైపునకు వెళ్లే బస్సులు సీబీఎస్ నుంచి బయలుదేరుతాయి.

ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ వైపునకు వేళ్లేవి జేబీఎస్, పికెట్ నుంచి వెళ్తాయి. వరంగల్, హన్మకొండ, జనగామ, పరకాల, నర్సంపేట, మహబుబాబాద్, తొర్రురూ, యాదగిరిగుట్ట బస్సులు ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఉప్పల్ బస్టాండ్ నుంచి నడుస్తాయి. విజయవాడ, విజయనగరం, గుంటూరు, విశాఖపట్నం బస్సులు ఎల్బీనగర్ నుంచి బయలుదేరుతాయి. మిగతా సర్వీసులు యథావిధిగా ఎంజీబీఎస్ నుంచే నడుస్తాయని టీఎస్ఆర్టీసీ సంస్థ తెలిపింది.

గతేడాది దసరాకు 4280 ప్రత్యేక నడపగా..అందులో 239 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ కల్పించారని సంస్థ ఎండీ సజ్జనార్ తెలిపారు. గత దసరా కన్నా ఈ సారి దాదాపు 1000 (20 శాతం) ఆర్టీసీ బస్సులను అదనంగా నడుపుతున్నామన్నారు. ముందస్తు రిజర్వేషన్ సర్వీసులను కూడా 535కి పెంచినట్లు తెలిపారు. ప్రధానంగా హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముండటంతో ఆ మేరకు ఏర్పాట్లు- చేయడం జరిగిందని ఆయన వెల్లడించారు. రెగ్యూలర్ సర్వీసుల మాదిరిగానే ప్రత్యేక బస్సులకు కూడా సాధారణ చార్జీలనే సంస్థ వసూలు చేస్తుందన్నారు.

స్పెషల్ సర్వీసులకు ఒక్క రూపాయి కూడా అదనంగా వసూలు చేయడం లేదని పేర్కొన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే లక్ష్యంగా సంస్థ అన్ని చర్యలు తీసుకుందన్నారు. ఈ ప్రత్యేక సర్వీసులను ప్రయాణికులు ఉపయోగించుకుని క్షేమంగా, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన కోరారు. ఈ ప్రత్యేక సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను సంస్థ అధికారిక వెబ్ సైట్‌లో చేసుకోవాలని ఆయన కోరారు. దసరా స్పెషల్ సర్వీసులకు సంబంధించి పూర్తి సమాచారం కోసం టీ–ఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033లకు సంప్రదించాలని ఎండీ సజ్జనార్ సూచించారు

# కలుషిత రాజకీయాల నుంచి జనసేన కమలం వికసిస్తుంది- పవన్ కల్యాణ్



మచిలీపట్నం, అక్టోబర్ 2:అవినీతి, దౌర్జన్యంతో ప్రజల కష్టాన్ని, శ్రమను వైకాపా నేతలు దోచుకుంటున్నారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా మచిలీపట్నం సువర్ణ కల్యాణ మండపంలో రెండు గంటల పాటు పవన్ మౌన దీక్షకు కూర్చు న్నారు. ముందుగా గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి సందర్భంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ, బ్రిటిషర్ల లక్షణాలు పుణికి పుచ్చుకున్న పాలకులు రాష్ట్రంలో ఉన్నారు. ప్రజలను వర్గాలుగా విభజించి పాలించే ధోరణిలో వెళ్తున్నారు. ఓటు, సత్యాగ్రహం విలువను గాంధీజీ తెలియచెప్పారు. ఆ ఆయుధాలు ఉపయోగించి నయా బ్రిటిష్ పాలకులను రాష్ట్రం నుంచి పంపించడం మన ధర్మంగా రాష్ట్ర ప్రజలు భావించాలని జనసేనాని పిలుపునిచ్చారు.

దేశానికి జాతీయ జెండా ఇచ్చిన నేల మీద గాంధీ జయంతి చేసుకోవడం నా అదృష్టం అని ఆయన వ్యాఖ్యనించారు. జాతి ప్రేరణ కోసం పెట్టినది మచిలీపట్నం లోని నేషనల్ కాలేజీ.. ఎందరో మహానుభావులు నేషనల్ కాలేజీ విద్యార్థులు.. నేషనల్ కాలేజీలో ఒకసారైనా అడుగు పెట్టాలి.. ఇప్పుడు ఆ కాలేజీ పరిస్థితి సరిగ్గాలేదు అని ఆయన ఎద్దేవా చేశారు. రాముడి పాటని ఈశ్వర్ అల్లా చేర్చి మన దేశ ఔన్నత్యాన్ని పెంచిన గాంధీకి మనం రుణపడి ఉంటాం అని జనసేనాని అన్నారు.పది లక్షల మందిని జాతీయ గీతానికి నిలబెట్టిన నేల మచిలీపట్నం అని పవన్ కళ్యాణ్ అన్నారు. గ్రామ స్వరాజ్యాన్ని రాష్ట్రంలో పూర్తిగా చంపేశారు అని అన్నారు. ఎన్నికలు చాలా కష్టమైనవి.. బ్రిటిష్ వారికి ఉన్న సంయమనం కూడా లేదు మన రాష్ట్ర నాయకులకు.. ఇప్పుడు సమకాలీన రాజకీయాలు సంయమనంతో ఉంటాయని ఆశిస్తున్నా.. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలి.. కలుషితమైన రాజకీయాల నుంచీ జనసేన అనే కమలం వస్తుంది అని ఆయన పేర్కొన్నారు.

# 3 నుంచి పరీక్షలు, 14 నుంచి దసరా సెలవులు..

అమరావతి, అక్టోబర్ 2: ప్రభుత్వం పాఠశాలలకు ఈ నెల 14 నుంచి 24 వరకు దసరా సెలవుల్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో ఈ నెల 3 నుంచి 6 వరకు పాఠశాల విద్యాశాఖ ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ)–2 పరీక్షలు నిర్వహించనుంది. అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత, పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి నిర్దేశించిన సిలబస్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తారు. ఉమ్మడి ప్రశ్నాపత్రం ఆధారంగా పాత పద్ధతిలోనే పరీక్షలు జరుగుతాయి.

ప్రశ్నాపత్రాలను పరీక్ష జరిగే రోజు విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులకు పంపిస్తారు. పరీక్షకు గంట ముందు ఆయా పాఠశాలల హెచ్ఎంలకు ప్రశ్నాపత్రాలు పంపాలని ఇప్పటికే ఎంఈవోలకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. 9, 10 తరగతుల విద్యార్థులకు రోజుకు రెండు పరీక్షలు ఉదయం, 6, 7, 8 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం పరీక్షలు నిర్వహించనున్నారు.

ఒకటి నుంచి 5వ తరగతుల విద్యార్థులకు ఉదయం ఒకటి, మధ్యాహ్నం మరొక పరీక్ష నిర్వహిస్తారు. 10వ తేదీలోగా సమాధాన పత్రాలను మూల్యాంకనం చేసి విద్యార్థులకు అందిస్తారు. అలాగే ఆన్‌లైన్ పోర్టల్‌లోనూ మార్కులు నమోదు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 10న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రగతిని తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది.

# చంద్రబాబు అరెస్ట్ ను నిరసిస్తూ ఎన్టీఆర్ కుటుంబ సభ్యుల నిరశన దీక్ష

హైదరాబాద్, అక్టోబర్ 2:టిడిపి అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారంటూ హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఎన్టీఆర్ కుటుంబసభ్యులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో ఎన్టీఆర్ కుమార్తె గారపాటి లోకేశ్వరి, నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర, గారపాటి శ్రీనివాస్, చలసాని చాముండేశ్వరి, తారకరత్న సతీమణి అలేఖ్య రెడ్డి, నందమూరి జయశ్రీ, సుధ, శిల్ప, దీక్షిత, రాహుల్, తారకరత్న కుమార్తె నిష్క తదితరులు పాల్గొన్నారు.

అలాగే తెలంగాణ టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌తో పాటు ఇతర ముఖ్యనేతలు, కార్యకర్తలు దీక్షకు కూర్చొన్నారు. సాయంత్రం 5 గంటల వరకు తెదేపా నేతల దీక్ష కొనసాగనుంది.

మరోవైపు ఎన్టీఆర్ ఘాట్‌లో నందమూరి హరికృష్ణ కుమార్తె సుహాసిని దీక్ష చేపట్టారు. ఆమెతో పాటు కేంద్రమాజీ మంత్రి పనబాక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఈ సందర్భంగా కార్యకర్తలు డిమాండ్ చేశారు. 'సైకో పోవాలి.. సైకిల్ రావాలి' అంటూ నినాదాలు చేశారు.

# మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన..

## రక్తదానం చేసిన కలెక్టర్ దంపతులు

కరీంనగర్, అక్టోబర్ 2:ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసేందుకు పెద్దపల్లి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సోమవారం ఉదయం నుండే సబ్ డివిజన్ పరిధిలోని 6006 మంది యువతీ యువకులు శిబిరానికి హాజరై రక్తదానం చేశారు. రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి స్వయంగా వారికి సర్టిఫికెట్లతో పాటు పండ్లు పంపిణీ చేశారు.

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ దంపతులు శిబిరానికి హాజరై రక్తదానం చేశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి రక్తదానం చేసిన యువతీ యువకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్, ఏసీపీ ఎడ్ల మహేష్, మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ దాసరి మమత రెడ్డి, విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస్, మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐలు అనిల్, జగదీష్, ఎస్ఐ మహేందర్ తో పాటు పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

# బిహార్‌లో 'స్వచ్ఛత హి సేవ'లో పాల్గొన్న 5.8 కోట్ల మంది ప్రజలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 2:జీవిక దీదీస్ (మహిళల స్వయం సహాయక సంఘాలు) బిహార్‌లో "స్వచ్ఛత హి సేవ"- 2023 కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్నాయి, 'వ్యర్థ రహిత భారతదేశం' ప్రచారానికి నాయకత్వం వహిస్తున్నాయి. శ్రమదానం, పరిశుభ్రత కార్యకలాపాలపై స్థానికులకు అవగాహన కల్పించడం, పాల్గొనడం, ప్రోత్సహించడంపై ప్రధాన దృష్టి పెట్టారు. బిహార్ రాష్ట్రం మొత్తంలో సాధారణ స్థలాలు, మార్కెట్ ప్రదేశాలు, వీధులు, చెత్త ప్రదేశాలు, గంగా నది ఒడ్డు, పర్యాటక, చారిత్రక, మతపరమైన ప్రదేశాల్లో చెత్తను తీసేసేందుకు భారీ ప్రజా ఉద్యమం సాగుతోంది.

జీవిక బిహార్‌లో సుమారు 10 లక్షల మహిళా స్వయం సహాయక బృందాలు ఉన్నాయి. 74 వేలకు పైగా గ్రామ స్థాయి సంస్థల భారీ నెట్‌వర్క్ ఇది. తద్వారా, బిహార్‌లో 'స్వచ్ఛత హి సేవ' కోసం సుమారు 1.24 కోట్ల మంది మహిళలు ఏకం అయ్యారు, 'నారీ శక్తి'ని ప్రతిబింబించారు.

హర్ దిన్–ఏక్ గావ్ (ప్రతి రోజు – ఒక గ్రామం) కోసం ఒక సమగ్ర ప్రణాళిక రూపొందించడం జరిగింది. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లోని ప్రభుత్వ అధికారులు సహా సమాజంలోని అన్ని వర్గాల నుంచి చురుకైన భాగస్వామ్యం నెలకొంది. జిల్లా మేజిస్ట్రేట్‌లు కూడా తమ సిబ్బందితో వచ్చి స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తూ శ్రమదానం చేపట్టారు. భారీగా జనసంచారం ఉండే ప్రదేశాలు, స్థానిక మార్కెట్లు, వీధులు మొదలైన ప్రదేశాలను శుభ్రపరిచే కార్యక్రమాలను డీఎంలు చేపడుతున్నారు. 'వ్యర్థ రహిత భారతదేశం'ను ప్రచారం చేయడానికి, స్థానిక పారిశుధ్య అవసరాలను పరిష్కరించడానికి ప్రభుత్వం జన్ సంవాద్‌లు నిర్వహిస్తోంది. పారిశుధ్య కార్మికులను, వారి సేవలకు గుర్తుగా సత్కరించడంతోపాటు, వారి కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

పాఠశాల స్థాయిలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడం, పాఠశాల పిల్లలకు పరిశుభ్రత ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం ద్వారా పిల్లలను సంపూర్ణ పారిశుద్ధ్యానికి తొలి మెట్టుగా మారుస్తున్నారు. తద్వారా, కుటుంబాలు, వారి చుట్టుపక్కల వారికి ఓడీఎఫ్ ప్లస్ సందేశాలను ప్రచారం చేసేలా పారిశుధ్య ప్రచారకర్తలుగా వారిని మారుస్తున్నారు. సుమారు 30,000 పాఠశాల స్థాయి కార్యకలాపాలు చేపట్టారు, 65 లక్షలకు పైగా విద్యార్థులకు భాగస్వామ్యం కల్పించారు. వ్యక్తిగత గృహ మరుగుదొడ్లను నిర్మించడానికి గ్రామ స్థాయిలో సామూహిక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 36 వేల వ్యక్తిగత గృహ మరుగుదొడ్లు నిర్మించారు.

ప్రజా ప్రతినిధులు, క్షేత్రస్థాయి కార్యకర్తలు, సమాజంలోని ప్రముఖులతో జన సంవాద్ లేదా క్షేత్రస్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నారు, తద్వారా గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్‌గా మార్చేందుకు అందరూ కలిసి వస్తున్నారు. గృహ, సామాజిక స్థాయుల్లో ద్రవ ఘన వ్యర్థాల నిర్వహణ కోసం అవగాహన, కార్యాచరణ చర్యలను రూపొందించడానికి స్వచ్ఛత చౌపల్స్ నిర్వహిస్తున్నారు.

రాష్ట్రంలోని 12 జిల్లాల్లోని 266 గ్రామ పంచాయతీల పరిధిలోని గంగా తీరాలను శుభ్రం చేసేందుకు రాష్ట్రం ప్రత్యేక ప్రచారానికి సిద్ధమైంది. సంఘాలు, నెహ్రూ యువ కేంద్రం, పారిశుధ్య కార్మికులు గంగానది ఒడ్డున పరిశుభ్రత పనుల్లో నిమగ్నమయ్యారు. అన్ని రకాల ప్రయత్నాల ద్వారా దాదాపు 5.80 కోట్ల మంది ప్రజలను 'స్వచ్ఛత హి సేవ'లో పాల్గొనేలా చేయడం ద్వారా పారిశుద్ధ్యం ప్రతి ఒక్కరి బాధ్యతగా బిహార్ మారుస్తోంది. తద్వారా, రాష్ట్రాన్ని ఓడీఎఫ్ ప్లస్ లక్ష్యాల దిశగా వేగంగా నడిపిస్తోంది.

# సుమారు రూ. 1651 కోట్ల వ్యయమయ్యే వివిధ అభివృద్ధి పనులను కేంద్ర హోం మంత్రి మరియు సహకార మంత్రి శ్రీ అమిత్ షా శంకుస్థాపన



న్యూఢిల్లీ, అక్టోబర్ 2:గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (ఏ ఎం సీ) మరియు అహ్మదాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏ యూ డీ ఏ) యొక్క సుమారు 1651 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి పనులను కేంద్ర హోం మంత్రి మరియు సహకార మంత్రి శ్రీ అమిత్ షా ఈరోజు ప్రారంభించారు మరియు శంకుస్థాపన చేశారు. శ్రీ అమిత్ షా సర్ఖేజ్, భదాజ్ గ్రామం, ఓగ్నాజ్, జగత్‌పూర్ గ్రామం మరియు త్రాగడ్‌లోని చెరువుల పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్ సహా పలువురు ప్రముఖులు కూడా పాల్గొన్నారు.

గాంధీనగర్ లోక్‌సభ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టని వార్డు లేదని కేంద్ర హోంమంత్రి అన్నారు. అహ్మదాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ మరియు గుజరాత్ ప్రభుత్వం ప్రజల నుండి డిమాండ్ కంటే ముందుగానే అభివృద్ధి పనులను ప్రారంభించాయని ఆయన అన్నారు. ఇందుకు అహ్మదాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ మరియు గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపిన శ్రీ షా, ప్రజలు అడగకముందే ఇచ్చే సంప్రదాయం ఉందని చెప్పారు. గాంధీనగర్ లోక్ సభ నియోజకవర్గంలో గత 52 నెలల్లో రూ.17,544 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు.

ఈరోజు సుమారు రూ.1650 కోట్లతో ఏ ఎం సీ మరియు ఏ యూ డీ ఏ యొక్క 39 ప్రాజెక్టులను ప్రారంభించినట్లు శ్రీ షా తెలిపారు. వీటిలో 18 పథకాల ప్రారంభోత్సవం, 21 పథకాలకు భూమిపూజ చేశారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గత మూడు నెలల్లో ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ ప్రతిష్టను పెంచారని శ్రీ అమిత్ షా అన్నారు. ప్రధాని మోదీ జీ కేవలం మూడు నెలల్లోనే కొత్త పార్లమెంట్, చంద్రయాన్, జీ20, నారీ శక్తి వందన్ చట్టం వంటి నాలుగు ముఖ్యమైన పనులను పూర్తి చేశారు. 50 ఏళ్లలో ఇలాంటి పని ఒకటి చేయగలమని, అయితే మోదీ జీ 3 నెలల్లోనే 4 పనులు పూర్తి చేశారని అన్నారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం భారతదేశాన్ని ప్రపంచంలోనే ప్రథమంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడతోందని ఇదే నిదర్శనమని తెలియజేస్తోంది. ప్రధానమంత్రి అయిన తర్వాత శ్రీ నరేంద్ర మోదీ ఇస్రోకు పునర్వైభవం తీసుకొచ్చారని, అంతరిక్ష రంగంలో భారత్‌ను అగ్రస్థానానికి తీసుకెళ్లేందుకు శాస్త్రవేత్తలకు స్ఫూర్తినిచ్చారని హోంమంత్రి అన్నారు. ఫలితంగా, భారతదేశం మరియు ప్రపంచం మొత్తం చంద్రయాన్‌పై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడాన్ని చూసింది, ఇది మనందరికీ చాలా గర్వకారణం. శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం జీ20 సదస్సును విజయవంతంగా నిర్వహించిందని శ్రీ షా అన్నారు. భారతదేశానికి ముందు చాలా దేశాలు జీ20 సదస్సును నిర్వహించాయి, రాబోయే 25 సంవత్సరాలలో భారతదేశం జీ20ని నిర్వహించిదానికి ధీటుగా నిర్వహించడం అన్ని దేశాలకు సవాలుగా ఉంటుందని అన్ని దేశాల దేశాధినేతలు భావిస్తున్నారు. ఢిల్లీ డిక్లరేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదించడం ద్వారా ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ యావత్ ప్రపంచానికి ఒక సందేశాన్ని అందించారు. ఆఫ్రికన్ యూనియన్‌ను జీ20 లో చేర్చడంతో పాటు, భారతదేశం అభివృద్ధి చెందిన దేశాలతో పాటు అభివృద్ధి చెందుతున్న దేశాలకు అండగా నిలుస్తుందని శ్రీ నరేంద్ర మోదీ సందేశం ఇచ్చారు. "మాతృశక్తి వందన" స్త్రీ పట్ల వినయం ఎలా ప్రదర్శించాలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అద్భుతమైన ఉదాహరణగా చేసి చూపారని కేంద్ర హోం మంత్రి మరియు సహకార మంత్రి అన్నారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నారీ శక్తి వందన చట్టం ద్వారా రాష్ట్రాల అసెంబ్లీలు మరియు లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించారు. విధాన రూపకల్పన, చట్టాల రూపకల్పనలో మహిళల సహకారం ఎంతో కీలకమని అన్నారు. ఏళ్ల తరబడి ఈ బిల్లు పై తాత్సారం జరిగిందని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ కొత్త పార్లమెంటును నిర్మించి, గణేష్ చతుర్థి రోజున దానిని ప్రారంభించి, కొత్త పార్లమెంట్‌లో మొదటి బిల్లుగా నారీ శక్తి వందన్ బిల్లును తీసుకువచ్చారు. భారతదేశ ప్రాచీన సంస్కృతి నుండి మనకు వారసత్వంగా వచ్చిన స్త్రీలు మరియు తల్లులను గౌరవించే సంస్కృతికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ చట్టబద్ధమైన రూపం ఇచ్చారని శ్రీ షా అన్నారు.ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అనేక పథకాలు తీసుకొచ్చారని కేంద్ర హోం మంత్రి, సహకార మంత్రి అన్నారు. వీటిలో ఇటీవల ప్రారంభించిన విశ్వకర్మ పథకం చాలా ప్రత్యేకం. దేశంలో కోట్లాది మంది వివిధ రకాల చిరు వ్యాపారాలు చేతి వృత్తులు చేసుకుంటున్నారని, అవి లేకుండా దేశాభివృద్ధి సాధ్యం కాదన్నారు. విశ్వకర్మ యోజన కింద, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అటువంటి వారికి నైపుణ్యం కల్పించడం, నిపుణులను చేయడం, వారికి పరికరాలు ఇవ్వడం మరియు యంత్రాల కొనుగోలు కోసం రూ. 3 లక్షల వరకు రుణాలు అందించే ఏర్పాట్లు చేశారు. స్వాతంత్ర్యానంతరం మొదటి సారిగా, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ విశ్వకర్మ యోజనను ప్రారంభించడం ద్వారా 20 కంటే ఎక్కువ చిన్న చేతి వృత్తి శ్రామిక వర్గాలను ప్రభుత్వ పథకంలో చేర్చే దార్శనికతతో కూడిన పనిని చేసారు. అభివృద్ధిలో వెనుకబడిన సమాజాన్ని ఇతరులతో సమానంగా తీసుకురావడానికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ విశ్వకర్మ యోజన ద్వారా పెద్ద ముందడుగు వేశారని శ్రీ షా అన్నారు.

రాబోయే రోజుల్లో గుజరాత్ అంతటా పరిసరాలు పర్యావరణం మరింత పరిశుభ్రంగా మరియు అందంగా మారేందుకు తమ ఇంటి చుట్టూ కనీసం 3 చెట్లను నాటాలని శ్రీ అమిత్ షా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్, అహ్మదాబాద్ మేయర్ శ్రీమతి కృతజ్ఞతలు తెలిపారు. గాంధీనగర్ లోక్‌సభ నియోజక వర్గంలో సుమారు రూ. 1650 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు మరియు శంకుస్థాపన కార్యక్రమాలలో ప్రతిభా జైన్ మరియు ఏ యూ డీ ఏ అధికారులందరూ పాల్గొన్నారు.

# అంగన్వాడి ఉద్యోగులకు సంఘీభావం తెలిపిన సర్పంచ్ ప్రవీణ్ రావు



మహబూబాబాద్,అక్టోబర్ 2:(నేటినిజం ప్రతినిధి): అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని అంగన్వాడీ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ వడ్డెకొత్తపల్లి సర్పంచ్ నెమరుగొమ్ముల ప్రవీణ్ రావు సంఘీభావం తెలిపారు. సోమవారం రోజున మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలో అక్టోబర్ 2 గాంధీ జయంతిని పురస్కరించుకొని గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని అందించి నల్ల దుస్తులతో నిరసన వ్యక్తం చేశారు,అంగన్వాడి ఉద్యోగస్తులు చేస్తున్న నిరవధిక సమ్మె చేస్తున్న సందర్భంగా సంఘీభావం తెలిపిన స్థానిక సర్పంచ్ ప్రవీణ్ రావు మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులకు నెలకు 26 వేల జీతంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర రాష్ట్రాల్లో అంగన్వాడి ఉద్యోగులకు గ్రాట్యూటీ చెల్లిస్తుందని, కానీ తెలంగాణ రాష్ట్రంలో అది అమలు కాకపోవడం శోచనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చిలుసాని మల్లేష్, యూత్ నాయకులు పాక అనిల్ కుమార్, అంగన్వాడి సిబ్బంది పసుల స్వరూప,వై మంజుల, ఝాన్సీ , యాకలక్ష్మి ,సరళ , అండాలు, శోభ, సాంబలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# శిల్పారామంలో ట్రిబ్యూట్ వాల్‌కు భూమి పూజ



తిరుపతి, అక్టోబర్ 2: గాంధీ జయంతి సందర్భంగా ఈరోజు తిరుపతి శిల్పారామంలో స్వాతంత్ర్య సమరయోధుల స్మారకంగా నివాళి గోడ (ట్రిబ్యూట్ వాల్) నిర్మించేందుకు భూమిపూజ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పీకర్ తమ్మినేని సీతారామ్, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్ కె రోజా నిర్వహించారు. ముఖ్యంగా ఈ "ట్రిబ్యూట్ వాల్" ద్వారా స్వాతంత్ర్య పోరాటంలో తమ జీవితాలను త్యాగంచేసిన సమరయోధుల గురించి వారు చేసిన పోరాటాలు గురించి భావితరాలకు తెలిసే విధంగా వారి చిత్రంతో పాటుగా ఏర్పాటు చేసే క్యూఆర్ కోడ్ ద్వారా వారి వివరాలు తెలిసే విధంగా ఏర్పాటు చేయనున్నారు. ఈ వాల్ నిర్మించేందుకు ముందుకొచ్చిన చక్రా ఫౌండేషన్ వారికి వక్తలు ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి స్పీకర్ సెల్వన్, పర్యాటక శాఖా మంత్రి రోజా, రాష్ట్ర శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ సి ఈ ఓ శ్యామ్ సుందర్ రెడ్డి తో కలిసి భూమి పూజ నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి, తిరుపతి నగర మేయర్ శిరీషా, తదితరులు కూడా పాల్గొన్నారు.

